బస్సులు రాక బాధలు

- ఇబ్బందులు పడుతున్న జయ్యారం వాసులు
- సౌకర్యం లేక చదువు ఆపేస్తున్న విద్యార్థులు



చిన్నగూడూరు: ప్రతీ మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలనే ఆలోచనతో ఆర్టీసీ ఆధ్వర్యంలో పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నారు. కానీ అవి పల్లెలకు వెళ్లడం లేదు. గతంలో రోజుకు నాలుగు, ఐదు ట్రిప్పులు సర్వీసు చేసిన బస్సులు ఇప్పుడు ఒక్క ట్రిప్పుకు కూడా మోక్షం లేకుండాపోయింది. దీంతో జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు ఈ గ్రామానికి రావాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నా.. బస్సులు లేక వాటిని వినియోగించకుండా డబ్బులు పెట్టి ఆటోలో వెళ్తున్నామని మహిళలు చెబుతున్నారు. ఇలాంటి కోవకు చెందిన చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామస్తులు ఊరు విడిచి వెళ్లలేక పోతున్నాం.. బస్సులు లేక ఆడపిల్లల చదువులు మధ్యలో ఆపేస్తున్నాం అంటున్నారు. ఎన్నిసార్లు డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా బస్సు నడపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సులు లేక ఇబ్బందులు

గతంలో మహబూబాబాద్ డిపో నుంచి పర్వతగిరి మీదుగా చిన్నగూడూరు మండల కేంద్రానికి వెళ్లి అక్కడి నుంచి జయ్యారం, సూదనపల్లి, కందికొండ మీదుగా మహబూబాబాద్ సర్వీస్ నడిచేది. దీంతో ఐదు వేల జనాభా ఉన్న జయ్యారంతోపాటు మంగోరుగూడెం, చెరువు ముందుతండా, మోగ్యాతండా, పెద్దతండా, మన్నెగూడెం, సూదనపల్లి, కందికొండ గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యంగా ఉండేది. దీంతో వివిధ పనులకోసం రైతులు, మహిళలతోపాటు, విద్యార్థులకు చదువుల నిమిత్తం మహబూబాబాద్ వచ్చే వారు. రోజుకు ఐదు ట్రిప్పుల చొప్పున సర్వీసు ఎప్పుడు ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉండేది. కానీ కొద్దిరోజులుగా బస్సు నిలిపి వేశారు. దీంతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఎన్ని వినతులు చేసినా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సు వేయడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఇబ్బందుల పడుతున్నాం..



గతంలో మా ఊరికి ఐదు ట్రిప్పులు బస్సు నడిచేది. గ్రామం నుంచి మహిళలు, విద్యార్థులు, రైతులు, కూలీలు రోజు మహబూబాబాద్, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడు బస్సు రావడం లేదు. ఊరు నుంచి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రెండు ట్రిప్పులైన బస్సును నడిపించాలి.

– ఉపేందర్, జయ్యారం

బస్సుల కొరత ఉంది



గతంలో జయ్యారం, ఇతర గ్రామాలకు సెటిల్ సర్వీసులు నడిచేవి. సర్వీస్ రద్దు చేశామని గ్రామస్తులు వినతి పత్రాల ఇచ్చారు. కానీ ఇప్పుడు బస్సులు, కండక్టర్ల కొరత ఉంది. కొత్త బస్సులు వచ్చిన తర్వాత జయ్యారం సర్వీసును పునరుద్ధరిస్తాం.

– శివప్రసాద్, డిపో మేనేజర్, మహబూబాబాద్

క్లుప్తంగా

వైద్యులను సంప్రదించాలి



మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలో మూడు డెంగీ కేసులు నమోదు కావడంతో అప్రమత్తమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం మరిపెడలోని ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా హెచ్ఈఓ కృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం వచ్చే జ్వరాలకు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. లేదంటే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు నర్సుబాయి, నాగమణి, ఆశవర్కర్స్ సునీత, శోభ, శ్రీదేవి, అనసూయ, వినోద, కవిత, వైద్య బృందం సాయిశ్రీ, లక్ష్మీకుమారి, ఆచార్యులు, వీరన్న, నర్సయ్య పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



మహబూబాబాద్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే ఆర్ఎంపీలు జాగ్రత్తలు పాటించాలని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మహబూబాబాద్ మండలంలోని గ్రామాల్లోని ఆర్ఎంపీలతో రూరల్ పోలీసుస్టేషన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు ప్రజలకు వైద్యం చేసే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించవద్దన్నారు. ఆర్ఎంపీల వైద్యం హద్దులు దాటితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి, ఆర్ఎంపీల సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగు రాములు



పెద్దవంగర: మండలంలోని బొమ్మకల్లు గ్రామానికి చెందిన రంగు రాములు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు ప్రకటించారు.

వృద్ధుడి ఆత్మహత్య

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన గండి కృష్ణమూర్తి(70) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కృష్ణమూర్తి కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్యం బాగలేక మానసికంగా బాధపడుతున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులతో గతంలో మూడుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆరోగ్యం నయం కాకపోవడంతో మనస్తాపంతో శనివారం ఉదయం పంట పొలాల్లో ఉన్న మర్రిచెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి కుమారుడు కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడ కోసుకుని ఆత్మహత్యాయత్నం

కేసముద్రం: భార్య గొడవ పడి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి కత్తితో మెడ కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని కల్వల గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంగా.. గ్రామానికి చెందిన కొనేటి వెంకన్న, మమత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈక్రమంలో వారం క్రితం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈమేరకు కల్వలకు వచ్చిన వెంకన్న మనస్తాపానికి గురై రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న కత్తితో మెడ కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

దుకాణాల్లో చోరీ

తొర్రూరు: పట్టణంలోని రెండు దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ బట్టల దుకాణం తాళాలు పగలగొట్టి దొంగలు సుమారు రూ.70వేల విలువ చేసే దుస్తులను అపహరించారు. దాంతోపాటు మరో కిరాణ దుకాణంలో షటర్ తాళాలు పగలగొట్టి సిగరెట్ డబ్బాలు, పది రూపాయిల కాయిన్స్ ఎత్తుకెళ్లారు. ఆధారాలు లభించకుండా సీసీ కెమెరాలు, డీవీఆర్ బాక్సును సైతం అపహరించారు. సమాచారం అందుకున్న ఎస్సై రాంజీనాయక్ క్లూస్ టీం సహాయంతో వివరాలు సేకరించారు. ఘటనపై ఫిర్యాదు అందిందని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్: ప్రతీ ఒక్కరు దివ్యాంగులను ఆదుకోవాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులోని లెనిన్‌నగర్ కాలనీలో శనివారం ఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్(ఐసీఎం) ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రామ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులను అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి దివ్యాంగులకు చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న, ఐసీఎం జిల్లా అధ్యక్షుడు సేవ్యా, గణేశ్, కిరణ్, ఏలియా, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

35క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న రేషన్ బియ్యంతో ఎస్సై

నెల్లికుదురు: అక్రమంగా నిల్వ ఉంచిన 35క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. శనివారం ఎస్సై మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన ఆకుల అజయ్, తుంపిల్ల ఉపేందర్ ఇద్దరు కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి నిల్వ చేసినట్లు తెలిపారు. హనుమాన్ తండా శివారు తారాసింగ్ బావి తండా పరిధిలోని ఓ రైస్ మిల్లు యజమాని దళపతి ఏసు వర్మతో కలిసి ఆ ఇద్దరు మిల్లు వద్దకు రేషన్ బియ్యం తరలిస్తున్నారన్నారు. తనిఖీల్లో భాగంగా తుంపిల్ల ఉపేందర్ ఇంటి వద్ద బియ్యం పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. 35క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



చిన్నగూడురు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ

దంతాలపల్లి: రైతులకు, గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తొర్రూరు విద్యుత్ డీఈ మధుసూదన్ అన్నారు. మండంలోని రేపోణి గ్రామంలో శనివారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. అధికలోడు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, అక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో కలిసి డీఈ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్, లైన్‌ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, లైన్‌మన్ వేమన, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలి

చిన్నగూడూరు: రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ నవ్య అన్నారు. సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో పొలంబాట కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జేఎల్ఎం క్రాంతి, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెంటనే గ్రాట్యుటీ చెల్లించాలి



మాట్లాడుతున్న శ్రీశైలం

నెల్లికుదురు: ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్ లాంటి ఆర్థిక ప్రయోజనాలను నాలుగేళ్ల తర్వాత చెల్లిస్తామని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొనడం విడ్డూరంగా ఉందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. మండల అధ్యక్షుడు యాకయ్య అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 25నుంచి 30 సంవత్సరాలకు పైబడి సర్వీసు చేసిన ఉద్యోగులకు విరమణ తర్వాత అందించాల్సిన ప్రయోజనాలను అందజేయకుండా, ఆర్థికంగా నష్టం కలిగించే విధానాలతో అవమానించడం సరైంది కాదన్నారు. విరమణ పొందుతున్న ఉద్యోగులకు ఆర్థిక లబ్ధిని వెంటనే చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంగ శ్రీనివాస్, పద్మావతి, ప్రవీన్ కుమార్, మధుసుదన్, రాజు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం పోరాడిన మహానేత



నెహ్రూసెంటర్: శివశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్/మహబూబాబాద్: బడుగు బలహీనవర్గాలు, వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్ కోసం నిరంతరం పోరాడి సాధించిన మహానేత, ఆదర్శప్రాయుడు జస్టిస్ పుంజాల శివశంకర్ అని మున్నూరుకాపు సంఘం మహబూబాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మద్దెల రమేష్‌పటేల్ అన్నారు. జిల్లా కేంద్రంలో జస్టిస్ పుంజాల శివశంకర్ జయంతి శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో జన్మించిన ఆయన ఉస్మానియాలో న్యాయశాస్త్రం పట్టాపొంది హైకోర్టు న్యాయవాదిగా పని చేశారన్నారు. 1980లో సికింద్రాబాద్ నుంచి గెలుపొంది ఇందిరాగాంధీ మంత్రివర్గంలో న్యాయశాఖమంత్రి పని చేశారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి శ్రీనివాస్, జిల్లా యువజన అధ్యక్షుడు పిట్టల శ్రీకాంత్, నాయకులు ఆవుల కుమారస్వామి, పడాల శ్రీనివాస్, పిట్టల చంద్రశేఖర్, రామరాజు ఉపేందర్, చాపల వెంకన్న పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పుంజాల శివశంకర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చందాగోపి, స్వామి, ఏకాంతం, రావుల మురళీ, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విచారణ నివేదికను వెల్లడించాలి

కేసముద్రం: ఫోర్జరీ ఓచర్లతో తన ఖాతాలో డబ్బులు మాయం చేసిన సంఘటనపై సంబంధిత బ్యాంకు అధికారులు విచారణ చేసినప్పటికీ, అట్టి నివేదికను వెల్లడించడంలేదంటూ కేసముద్రంస్టేషన్‌కి చెందిన జయకృష్ణ అనే ఖాతాదారుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపాడు. మండల కేంద్రంలో గల ఓ బ్యాంకులోని తన ఖాతాలో ఉన్న సుమారు రూ.19లక్షలను 2022 సంవత్సరంలో ఫోర్జరీ ఓచర్లతో డ్రా చేశారని, దీనిపై జిల్లా అధికారులు విచారణ చేసి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఎవరిపైనా చర్య తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు నివేదికను ఇప్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.

పరామర్శ

దోర్నకల్: స్థానిక నెహ్రూస్ట్రీట్‌కు చెందిన కత్తెరసాల నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నాగమ్మ కుమారుడు మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్‌తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, పాండు నాయక్, శరత్, నరేష్, సతీష్‌కుమార్, రాంభద్రం, మియా, యశోధర్‌జైన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను అగ్రగామిగా నిలుపుతా



మాట్లాడుతున్న దయాకర్‌రావు

తొర్రూరు: బీఆర్ఎస్‌ను నియోజకవర్గంలో అగ్రగామిగా నిలుపుతానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సోషల్ మీడియాలో తాను పార్టీ మారుతానని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దాన్నెవరూ విశ్వసించవద్దన్నారు. బీఆర్ఎస్ వీడే ప్రసక్తే లేదన్నారు. త్వరలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు డాక్టర్ సోమేశ్వరరావు, తమ్మెర వీరభద్రరావు, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ‘వార్డు బాట’



బురదరోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు రేషపల్లి నవీన్, మాలోత్ రవీందర్, తోట రాజకుమారి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వార్డు బాట–మాట కార్యక్రమంలో భాగంగా సీపీఐ బృందాలు కాలనీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి సమస్యలు కాలనీల్లో పేరుకుపోయాయన్నారు. పట్టణంలోని ధర్మన్న కాలనీలో బురద రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో శంకర్, శ్రీనాథ్, రాకేష్, సాయి పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



కేసముద్రం: విరాళాలు సేకరిస్తున్న నాయకులు



గార్ల: నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

కేసముద్రం: కేరళ వరద బాధితుల కోసం శనివారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. మొత్తంగా సేకరించిన రూ.10వేలను పార్టీ జిల్లా కమిటీకి అందజేసినట్లు మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాపారావు, యాకుబ్‌రెడ్డి, సావిత్ర, నర్సయ్య, జయరాజ్ పాల్గొన్నారు.

గార్ల: కేరళ వరద బాధితుల కోసం గార్లలో సేకరించిన రూ.8,620 విరాళాల నగదును శనివారం సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌కు అందజేసినట్లు పార్టీ మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు తెలిపారు.

జర్నలిస్టుకు కడసారి వీడ్కోలు

జనగామ: వరంగల్‌లో శుక్రవారం జర్నలిస్టు యుగంధర్‌రెడ్డి అలియాస్ యోగి తన కూతురు ఆద్యతో కలిసి ఆత్మహత్య చేసుకోగా, శనివానం జనగామ జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు జరిగాయి. ఎంపీ కడియం కావ్య, టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు బీఆర్ లెనిన్, గాడిపెల్లి మధు, కొండల్‌రావు, ఇర్రి మల్లారెడ్డి, సురిగెల భిక్షపతి, ఓరుగంటి సంతోష్, పార్నంది వెంకటస్వామి, వెంకటరత్నం, ఎల్లారెడ్డి, రమేశ్, తదితరులు నివాళులర్పించారు. వారి ఆత్మశాంతి కలగాలని దేవున్ని ప్రార్థించారు.

సంక్షిప్త సమాచారం

మందులు అందుబాటులో ఉంచాలి

బయ్యారం: రోజురోజుకు జ్వరపీడితుల సంఖ్య పెరుగుతున్నందున ప్రభుత్వం అన్ని ఆరోగ్య సబ్ సెంటర్లలో మందులు అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో లేకపోవటం వలన జ్వర పీడితులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి అప్పులపాలు కావాల్సి వస్తోందన్నారు.

వాహనాల తనిఖీ



కురవి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కురవి పోలీసులు శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో కురవి ఎస్సై బైరు గోపి వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై జి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం

తొర్రూరు: లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. స్థానికులు కొండ్లె ఉమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని గోశాలలో తౌడు, కూరగాయలు అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు రేగూరి వెంకన్న, కందగట్ల సోమశేఖర్, చిలకమారి రామచంద్రయ్య, హీరాధర్, బుధారపు శ్రీనివాస్, రేగూరి శ్రీధర్ పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి

కేసముద్రం: హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోతు సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పలు హాస్టళ్లను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ బానోతు సింహాద్రి, చరణ్, అరుణ్, తిలక్ పాల్గొన్నారు.

రాఖీల పంపిణీ

దంతాలపల్లి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన రాఖీలను శనివారం మండల అంశకాలిన కార్యకర్త గుగులోత్ రవి శనివారం పంపిణీ చేశారు.

బాల్యతండాలో పారిశుద్ధ్య పనులు

కురవి: మండలంలోని నేరడ శివారు బాల్యతండాలో పంచాయతీ కార్యదర్శి యుగేందర్ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. సైడ్ కాల్వలను, రోడ్లపై ఉన్న మట్టిని శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తండాల్లో జ్వరాలు పెరిగిపోవడంతో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయించారు.

సీఐకు ఘనంగా వీడ్కోలు



దోర్నకల్: డోర్నకల్ సీఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న బి.ఉపేందర్‌రావుకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. 14నెలలపాటు డోర్నకల్ సీఐగా విధులు నిర్వహించిన ఉపేందర్‌రావు బదిలీపై వెళ్లగా శనివారం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. డోర్నకల్ సీఐగా నియమితులైన బి.రాజేష్ శనివారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు.

బోదకాలు వ్యాధిని అరికట్టాలి



కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో బోదకాలు వ్యాధి వ్యాప్తిని అరికట్టాలని ఎన్‌వీబీడీ అదనపు డైరెక్టర్ డాక్టర్ నర్సయ్య సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ శివప్రసాద్, పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

బయ్యారం: మోకాళ్ల లాలయ్య మృతి విప్లవోద్యమానికి తీరనిలోటు అని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య అన్నారు. మండలంలోని కోయగూడెంలో మృతి చెందిన లాలయ్య మృతదేహంను శనివారం సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, యాకన్న, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

శివాలయంలో ‘షాన్’ హీరో పూజలు



కొత్తగూడ: మండలంలోని కాకతీయులు నిర్మించిన గుండం శివాలయాన్ని శనివారం షాన్ సినిమా హీరో కుమార్‌యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుమార్ యాదవ్‌కు పూజారి భానుప్రసాద్ పూజలు చేసి ఆలయ విశిష్టతను వివరించారు.

కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

నర్సంపేట: అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ కోరారు. పట్టణంలో ఐత శ్రీకళ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో కృష్ణ మాట్లాడారు. కళాకారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. కళాకారులకు హెల్త్ కార్డులు ఇవ్వడంతోపాటు బస్సు, రైళ్ల ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని, వృద్ధాప్యంలో ఉన్న వారికి రూ.6 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. అలాగే అన్ని జిల్లాల్లో మినీ రవీంద్ర భారతి సాంస్కృతిక భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు రమేష్, అక్కపల్లి రమేష్, మియాపురం గోవర్ధన్, బత్తుల సుప్రియ, అముదాల సుమలత, కవిత, పవన్ కుమార్, స్వప్న, హంస, మంజుల, బోళ్ల హరిత, రాధిక, స్వరూప, ఎల్లాపురం భవాని, రమ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన మొక్కలు నాటాలి



మొక్కలు అందజేస్తున్న దైద వెంకన్న

మహబూబాబాద్ అర్బన్: రాబోయే బావితరాల కోసం గ్రామగ్రామాన మొక్కలు నాటాలని హరితమిత్ర అవార్డు గ్రహీత, ప్రకృతి ప్రేమికుడు దైద వెంకన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల నివాసంలో శనివారం మొక్కలు నాటి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దోసపాటి మల్లన్న, వేల్పుల వీరస్వామి, కామిరే ఉప్పలయ్య, గుడేల్లి నాగయ్య, కుక్కల ఉప్పలయ్య, జలగం వీరస్వామి, బండ ఆశన్న పాల్గొన్నారు.